రైఫిల్స్ భుజాన ఉంచుకుని రోడ్డుకి ఇరు వైపులా ఒకరి వెనక ఒకరు పదేసి అడుగుల దూరంలో నడుస్తున్నాం.

సాయంత్రం కానస్తూంది.

సూర్యుడు పశ్చిమాన దూరంగా, కొండల అవతల క్రుంకుతున్నాడు.

మధ్యాహ్నం నుంచి నడవటం మూలంగా అలిసిపోయాను. కాళ్ళు లాగుతున్నాయి. ఎక్కడయినా కాసేపు కూర్చోవాలని అనిపిస్తున్నా మిగతా సిపాయిలతోపాటు నడవక తప్పటం లేదు. కూర్చుంటే మళ్ళీ వెనకపడిపోతాను.

యుద్ధం మొదలయి పది రోజు లయింది. ఈ పది రోజులలో కంటి మీద కునుకు లేకుండా, విశ్రాంతి లేకుండా ముందుకు సాగుతున్నాం... అందరూ అలిసిపోయారు. కాని, ఏదో ఉత్సాహం అందర్నీ ముందుకు నడిపిస్తూంది.

కాళ్ళు బాగా లాగేస్తున్నాయి. ఇక లాభం లేదు. ఎక్కడయినా ఓ అరగంట విశ్రాంతి తీసుకుని మళ్ళీ బయలుదేరదామని నిశ్చయించుకున్నాను. ఉన్నట్టుండి ముందు నడుస్తున్న వాళ్ళు ఆగిపోయారు. నాయక్ జస్‌పాల్ సింగ్ పంజాబీలో ఏదో అరుస్తున్నాడు.

"సోదరులారా, ఇక్కడ ఓ అరగంట విశ్రాంతి తీసుకుందాం. ఆ తరవాత తిరిగి బయలుదేరదాం."

ఆ మాటలు వింటూంటే నాకు ప్రాణం లేచి వచ్చినట్టనిపించింది.

బద్ధకంగా ఓ మారు ఒళ్ళు విరుచుకున్నాను. వాటర్ బాటిల్ మూత తీసి చూశాను. నీళ్ళు అడుక్కి ఉన్నాయి. ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుంటే సగం బడలిక తీరుతుందని నీళ్ల కోసం చుట్టు పక్కల చూశాను. దాదాపు రెండు ఫర్లాంగుల దూరంలో ఓ వంతెన కనిపిస్తూంది. అక్కడ నీళ్లు ఉంటాయని అటు బయలుదేరాను.

వంతెన క్రింద చిన్న కాలవ ప్రవహిస్తూంది. ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని వంతెన మీదకి వచ్చాను. వంతెన మూలగా పిట్టగోడ మీద ఓ ముసలాడు కూర్చుని ఉన్నాడు. అతడి బట్టలు దుమ్ము కొట్టుకుని ఉన్నాయి. అతడు మా లాగే చాలా దూరం నుంచి నడిచి వస్తున్నవాడిలా బాగా అలిసిపోయి ఉన్నాడు.

ముసలాడు పాత కళ్లజోడు ఒకటి పెట్టుకున్నాడు. దానికి ఒక పక్క తాడు కట్టి దానిని చెవికి చుట్టాడు. అతడి గడ్డం బాగా నెరిసిపోయింది. నెత్తిమీద బాగా మాసిన గుడ్డటోపీ పెట్టాడు. అతడి వేషంబట్టి అతడు ముసల్మాన్ అని తెలుస్తూంది.

ముసలాడి దగ్గరకు వెళ్లి "ఏం బాబా, ఇక్కడ కూర్చున్నావు" అన్నాను హిందీలో. అతడు తల పైకెత్తి ఓసారి చూసి మళ్లీ తల దించుకున్నాడు. అతని మొహం చూస్తే దేన్ని గురించో బాధపడుతున్నవాడిలా కనిపించాడు. రైఫిల్ భుజాన్నుంచి దింపి, నేనూ ఆ వంతెన గోడమీద అతడికి దగ్గరలో కూర్చున్నాను.

ముసలాడు చెవికి చుట్టిన తాడు విప్పి, కళ్లజోడు దుమ్ము తుడుస్తున్నాడు.

ముసలాడికి హిందీ అంతగా అర్థం కాదేమోనని నాకు వచ్చిన కొద్దిపాటి బెంగాలీలో అడిగాను — "ఏం బాబా, ఇక్కడ కూర్చున్నావు" అని.

ముసలాడు ఓ సారి బరువుగా నిట్టూర్చాడు. "ఏం చెప్పను, నాయనా. ఊరు వదిలి రాక తప్పలేదు. అయిన వాళ్ళందర్నీ అక్కడే వదిలి పారిపోయొచ్చాను" అన్నాడు. ఆ మాట అంటూంటే ముసలాడి ముఖంలో విషాదం తాండవించింది.

"అయ్యో, పాపం" అన్నాను. అంతకంటే మరేమనాలో తోచలేదు.

ముసలాడు కళ్ళజోడు పెట్టుకొని తాడు చెవికి చుట్టాడు.

"మీ ఊ రేది, బాబా!" అడిగాను.

ముసలాడు చెయ్యెత్తి తూర్పు వైపు చూపిస్తూ, "అటు వైపు ఉంది మా పల్లె" అన్నాడు. తరవాత "ఎలా ఉందో నా గుడిసె? నా వాళ్ళు ఏమైయారో" అంటూ నిట్టూర్చాడు.

జేబులోనుంచి ఒక సిగరెట్టు తీసుకుని మరొకటి ముసలాడికి ఇవ్వబోతే, "వద్దులే, బిడ్డా" అన్నాడు.

సిగరెట్టు వెలిగించి, "అసలేమయింది, బాబా! మీ ఊరు వదిలి ఎందుకు వచ్చావు" అన్నాను.

ముసలాడు చెప్పటం మొదలు పెట్టాడు. "నాది అటు వైపు దూరంగా ఉన్న పల్లె, నాయనా! రోజూ ఊరి బయట గడ్డి కోసి, అమ్మి, ఆ డబ్బుతో నా దాదాని, బాబుని, రాజా—రాణీలని పెంచుకుంటున్నాను. మూడు రోజుల క్రితం ఊరి బయట దూరంగా ఉన్న గుట్టమీద గడ్డి కోస్తూంటే ఊళ్ళో జనమంతా పారిపోతూ కనిపించారు. పాకిస్తానీ సైన్యం ఊరిమీద పడిందట. విధిలేక అందరం కట్టు బట్టలతో పారిపోయొచ్చాం. నా వాళ్లందర్నీ అక్కడే వదిలేశాను."

"ఎవరు నా వాళ్ళందరూ?" అడిగాను.

"నా వాళ్ళందరూ నేను ప్రేమతో పెంచుకున్న ప్రాణులు, నాయనా. దాదా నా నల్ల మేకపోతు. ఆ చుట్టుపక్కల గ్రామాల్లో అంత పెద్ద పోతు లేదు. బాబు నా కుక్క. చాలా విశ్వాసమయిన వాడు. రాజా, రాణీ నా పావురాలు. వీళ్ళందర్నీ ఎంతో ప్రేమగా పెంచుకున్నాను. ఆ బద్మాష్ ముండకొడుకులు వాళ్లని ఏం చేశారో?"

ముసలాడి మాటలు వింటే నాకాశ్చర్యం వేసింది. ఇంతసేపూ దాదా, బాబు, రాజా, రాణీ అంటే ఎవరో అనుకున్నాను.

ముసలాడు దిగులుగా తన ఊరి దిశగా చూస్తూ, "దాదాని, బాబుని, రాజా, రాణీలని నా కన్నబిడ్డల్లా పెంచుకున్నాను. ఏమైయారో" అన్నాడు దిగులుగా.

"నీ జంతువుల కేం జరగదులే, బాబా! నువ్వేం బెంగ పెట్టుకోకు" అన్నాను.

ముసలాడు తల తిప్పి నా కేసి జాలిగా చూశాడు. "నీ కేం తెలియదు, నాయనా, వాళ్ళు కిరాతకపు వెధవలు. దేనినీ ఉంచరు" అన్నాడు.

"నీ పావురాలని బయట వదిలావా, గూటిలో ఉంచావా?" అడిగాను.

"గూటిలోనే ఉన్నాయి. కాని, దానికి తలుపు లేదు" అన్నాడు ముసలాడు.

"అయితే, ఇంకేం? తుపాకుల చప్పుడు విని అవి ఎగిరిపోయి ఉంటాయి."

"ఊఁ!" అన్నాడు ముసలాడు.

"నీ కుక్కని కట్టేశావా. వదిలేశావా!"

"బాబుని కట్టెయ్యలేదు. వాడు చాలా తెలివయిన వాడు. వాడి ప్రాణం వాడు కాపాడుకోగలడు. నా బెంగంతా మిగతా వాళ్లను గురించే."

"ఇక మిగిలింది మేక ఒక్కటే కదా. అదీ ఎక్కడికో పారిపోయి ఉంటుందిలే" అన్నాను.

ముసలాడు బరువుగా నిట్టూర్చి, "లేదు. దాదా ఎక్కడికీ పోలేడు. వాడిని ఇంట్లోనే కట్టేశాను" అన్నాడు.

అతడి కళ్లలో నీళ్ళు తిరిగాయి. "ఎంత ప్రేమగా పెంచుకున్నాను వీళ్లని! ఈ వాడు అందరూ నా కన్యాయం చేసి పోయారు" అన్నాడు.

నే నేం మాట్లాడలేదు.

ముసలాడు మళ్లీ మొదలు పెట్టాడు. "దాదాని ఓ రోజు కాలవలో కొట్టుకు పోతూంటే రక్షించి ఇంటికి తెచ్చాను. చిన్నప్పటినుంచి ఎంతో ప్రేమతో పెంచాను. నేను లేకపోతే వాడు గడ్డి, నీళ్లు ముట్టడు" అంటూ ముసలాడు కళ్ళు తుడుచుకున్నాడు.

"బద్మాష్ ముండకొడుకులు. నా దాదాని కోసుకుని తినేసి ఉంటారు. వాడిని బాగా మేపి వస్తాదుని చేశాను వాడి లావుపాటి మెడని పరపరా కోసేసి ఉంటారు దుర్మార్గపు వెధవలు."

ముసలాడు తన ఊరి దిశగా చూస్తున్నాడు.

"మీ ఊరి వాళ్లంతా ఏమైయారు, బాబా?"

"అందరూ ఇలా పోయారు, బిడ్డా!" ముసలాడు చెయ్యెత్తి చూపించాడు.

"నేను ముసలాడి నయిపోయాను. డెబ్బై ఐదేళ్లు వస్తున్నాయి. ఓపిక లేక మెల్లిగా నడుస్తూ ఇక్కడ దాకా వచ్చాను" అన్నాడు.

"పోనీ, నిన్నెక్కడకయినా చేర్చమంటావా, బాబా?" అడిగాను.

"వద్దు, నాయనా. ఇప్పటికే మేమందరం మీకు చాలా ఋణపడి ఉన్నాం. మా కోసం ఇంత దూరం వచ్చి ప్రాణాలకు తెగించి, తిండి, నీళ్ళు లేకుండా నయినా యుద్ధం చేస్తున్నారు. మిమ్మల్నింకా శ్రమ పెడితే అల్లా క్షమించడు."

ముసలాడి మీద నాకు సద్భావం పెరిగింది.

ముసలాడు మళ్లీ దిగులుగా నిట్టూర్చి, "ఎంత ముద్దుగా పెంచుకున్నాను వాళ్లని! అందరూ నాకు కాకుండా పోయారు" అన్నాడు.

దూరంగా మా వాళ్ళు లేచి నిలబడ్డారు. రైఫిల్స్ భుజాన వేసుకుని ఒకరి వెనక ఒకరు రోడ్డుకి ఇరు వైపులా నడవసాగారు.

కాస్సేపట్లో అందరూ వంతెన మీదుగా ముందుకి వెళ్లారు.

నేను లేచి నిలబడి హేవర్‌సేక్‌లో నుంచి ఒక రొట్టె, కొంత వెన్న, జామ్, బిస్కట్లు, రెండు సిగరెట్లు తీసి ముసలాడికి ఇచ్చాను. ముసలాడు తీసుకోనన్నాడు.

"నీ వాడి వనుకో, బాబా! తీసుకో" అంటూ అవన్నీ అతడి చేతిలో పెట్టి, రైఫిల్ భుజాన పెట్టుకుని ముందుకి అడుగు వేశాను.

"నా బంగారు బాంగ్లాకి స్వాతంత్ర్యం తీసుకురావటానికి యుద్ధం చేస్తున్నారు మీ రందరూ. మీకు ఇవ్వవలసింది పోయి మీ వద్ద నుంచి పుచ్చుకుంటున్నాను" అంటూ ముసలాడు నిట్టూర్చాడు.

నేను మరో అడుగు ముందుకి వేశాను.

"బద్మాష్ ముండకొడుకులు! నా

21-3-73

ఋణం

'ఉమ'

వాడా[illegible] [illegible]ంపేశారు. లేకపోతే నా చేతుల్లో వాడిని కోసి భారత సిపాయిలకి తినిపించి మా ఋణం కొంతయినా తీర్చుకునేవాడిని. ఇప్పుడు ఈ ఋణం ఎలా తీర్చను," ముసలాడు గొణిగాడు.

ఆ మాటలు విని ఒక్క క్షణం నిశ్చేష్టుడయ్యాను.

మా వాళ్లు అప్పటికే దూరం వెళ్లి పోవటం మూలంగా మరి గత్యంతరం లేక ముందుకి బయలుదేరాను. కొంత దూరం వెళ్లి వెనక్కి చూశాను.

ముసలాడు వంతెన మీద నిశ్చలంగా కూర్చుని ఆ ఊరి దిశగా చూస్తున్నాడు.